క్లుప్తంగా

నిధులు కేటాయించండి



తొర్రూరు : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సీఎంకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో పెండింగ్ రైతు రుణమాఫీ మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయాలని, కెనాల్ కాల్వల పనులు, రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి సీఎం సమ్మతి తెలిపారు.

గురుకులాల నిర్వీర్యం

● మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్



తొర్రూరు : గురుకులాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో గురుకుల బాట నిర్వహించారు. పట్టణంలోని మైనార్టీ, సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలను సందర్శించి సమస్యలపై నిరసన తెలిపారు. పాఠశాలల్లోకి వచ్చేందుకు పార్టీ నాయకులు యత్నించగా సంబంధిత అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో పాఠశాలల బయట ఆందోళన చేపట్టారు. మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు, అంకూస్, జనార్ధన్ రాజు, జైసింగ్, జి.శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎల్లయ్య



మహబూబాబాద్ : కేటీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేటీఆర్ కాలనీ వాసులు ఆందోళన చేసి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. నాయకులు ఉపేందర్, శ్రీను, వీరన్న, సాంబయ్య, మాధవి, సరస్వతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై చర్య తీసుకోవాలి

● కౌన్సిలర్ భూక్య శ్రీను



మహబూబాబాద్ : మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం శివారులో ఉన్న గిరిజనుల భూములను కబ్జా చేసిన జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ భూక్య శ్రీను డిమాండ్ చేశారు. స్థానిక గిరిజనులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గిరిజనులకు చెందిన సర్వే నంబర్లు 275, 278లో ఉన్న భూములను ప్రముఖ వైద్యుడు కబ్జా చేశారన్నారు. కార్యక్రమంలో బాల్‌సింగ్, లాల్‌సింగ్, రవి, భీమా, రూప్లి, దస్మా, తదితరులు పాల్గొన్నారు.

'రైతులు మోసపోవద్దు'

కురవి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల చేసిందని, రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సీరోలు మండల వ్యవసాయ శాఖ అధికారి చాయారాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీరోలు యూనియన్ బ్యాంకుకు 167 ఖాతాలకు రూ.1.97 కోట్లు జమ అయ్యాయని వెల్లడించారు. అలాగే కురవి, డోర్నకల్, మహబూబాబాద్ ఇతర బ్రాంచ్‌లలో రుణం తీసుకుని, కుటుంబాలు నిర్ధారణ కాక, రేషన్ కార్డులేక, ఆధార్ తప్పుల వల్ల మొదటి నుంచి మూడో విడత వరకు జమ కాని రైతులు 4వ విడతల జమ అయ్యాయని వివరించారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని దళారులు రైతులను నమ్మించి మోసం చేస్తున్నారని, నేరుగా బ్యాంకు ఆఫీసర్లను కలవాలని పేర్కొన్నారు.

సర్కార్ జాగ దొరికేనా?

● ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుపై ఆశలు



కన్నెగుండ్ల సమీపంలోని భూముల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

డోర్నకల్: నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల డోర్నకల్ మండలంలో ఏర్పాటు కోసం ఈ ప్రాంతవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. డోర్నకల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఖమ్మం, మహబూబాబాద్, హైదరాబాద్ లాంటి దూరప్రాంతాలకు వెళ్తున్నారు. డోర్నకల్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మోడల్ కళాశాలలో సీట్లకు పరిమితి ఉండటంతో పూర్తిస్థాయిలో విద్యార్థులకు సీట్లు దొరకడం లేదు. ప్రభుత్వ స్థలం లేదంటూ దశాబ్దాల కాలంగా ఇక్కడ ఎలాంటి విద్యా సంస్థలు ఏర్పాటు కాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలపై ఆశలు..

ప్రభుత్వం రెండో విడత నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను డోర్నకల్‌లో ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తుండటంతో అధికార పార్టీ నేతల కోరిక మేరకు రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ స్థలాలపై వెతుకులాట ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 25 ఎకరాల భూమి అవసరం కాగా అమ్మపాలెం గ్రామంలో సర్వే నంబర్ 102 నుంచి 107 నంబర్‌లో కొన్ని ప్రభుత్వ భూములు, చిలుకోడు గ్రామ పరిధిలో 83 సర్వే నంబర్‌లో సుమారు 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి, గొల్లచర్ల గ్రామ పరిధిలో 46వ సర్వే నంబర్‌లో 300 ఎకరాలు, కన్నెగుండ్ల పరిధిలో 136వ సర్వే నంబర్‌లో 25 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. వీటిలో కన్నెగుండ్ల పరిధిలోని ప్రభుత్వ భూమిలో ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని వినియోగంలోకి తెచ్చి ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాఠశాల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరుతున్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన



రైతువేదిక ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నర్సింహులపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందంటూ సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక ఎదుట అన్నదాతలు ఆందోళన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ 100 శాతం పూర్తి చేశామని ప్రకటించడంతో రైతు వేదిక వద్ద ఉన్న అధికారులను వారు అడిగి తెలుసుకున్నారు.రూ.2 లక్షల లోపు రుణమాఫీ ఉన్న రైతులు తమకు ఎందుకు మాఫీ కాలేదని అధికారులను నిలదీశారు. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు మందుల యాకూబ్, బొబ్బ అశోక్‌రెడ్డి, జేరుపోతుల రమేష్‌తో పాటుగా పలువురు రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని పునరుద్ధరించాలి



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

● సీపీఎం జిల్లా నాయకుడు రాజన్న

మరిపెడ రూరల్ : మండలంలోని పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద 365 జాతీయ రహదారిని పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా నాయకుడు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బ్రిడ్జి వద్ద ధ్వంసమైన జాతీయ రహదారిని సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ..రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆకేరు వాగు పొంగి అరకిలోమీటర్ మేర ధ్వంసమైందన్నారు. రహదారి కోతకు గురి కావడంతో ఇరుకుగా మారిందన్నారు. అధికారులు స్పందించి ధ్వంసమైన రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడపట్ల రాజశేఖర్, కందాల రమేష్, వీరయ్య, ఉమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



కురవి: ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్: మాధవపురంలో..

కురవి/మహబూబాబాద్ రూరల్ / పెద్దవంగర / దంతాలపల్లి : రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు సీరోలు మండలం కొత్తూరు(సీ) జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జశ్వంత్, మహబూబాబాద్ మండలంలోని మాధవపురం ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లెబోయిన ఉదయ్ కిరణ్, పెద్దవంగర మండలానికి చెందిన విద్యార్థిని కె.నందిని ఎంపికైనట్లు హెచ్‌ఎంలు, ఎంఈఓలు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన కొత్త జశ్వంత్, మల్లెబోయిన ఉదయ్ కిరణ్‌ను పాఠశాలలో సోమవారం అభినందించారు. అలాగే జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో దంతాలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో రెండు ద్వితీయ బహుమతులు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు వేణుమాధవరెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



తొర్రూరు/నెల్లికుదురు : మహిళలకు ఉచిత బస్సు పథకంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈ నెల 7న ఆటోల బంద్ పోస్టర్లను సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో, నెల్లికుదురు మండలంలోని ఆలేరు బస్‌స్టాండ్ సమీపంలో ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. అనంతరం రవి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం అందిస్తామన్న ప్రభుత్వ హామీని నిలుపుకోవాలన్నారు. నాయకులు మంగళపల్లి ప్రసాద్, చిలుక మల్లేష్, యాకూబ్ నాయక్, దినేష్, యాకయ్య, ప్రభు, సుధాకర్, అశోక్ , సట్ల నరేష్, శ్రీనివాస్, ముత్తయ్య, అమీర్, జలందర్, సాయిలు, వెంకన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల దందాను అరికట్టాలి

● సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ

● నీలికుర్తిలో ధాన్యం లోడ్ లారీ అడ్డగింత



లారీ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మరిపెడ రూరల్ : మండలంలోని నీలికుర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల దందాను అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నీలికుర్తి కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు తరలిస్తున్న ధాన్యం లారీ లోడును సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు.కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల వద్ద క్వింటాకు 5 కేజీలు తరుగు పేరుతో మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఎటువంటి టోకెన్, ట్రక్ షీట్, లైవ్ లొకేషన్ లేకుండా లారీలను లోడ్ చేస్తున్నాడని అన్నారు. రైతులను మోసం చేస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ముక్కోటి సాయిచరణ్, రైతులు బాల, శ్రీను, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకాన్ని పెంచాలి

● డీఎస్పీ తిరుపతిరావు



తనిఖీ చేస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : పోలీసులపై ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ ఎస్.తిరుపతిరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలతో పాటు, సిబ్బందికి పోలీసు శాఖకు మంజూరు చేసిన కిట్లను తనిఖీ చేసి, రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ సరవయ్య, ఎస్సై దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

నాసిరకం బియ్యాన్ని వెనక్కి తీసుకోవాలి

● ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్



భోజనాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కిరణ్

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని గిరిజన, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో సివిల్ సప్లై అధికారులు నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేశారని వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హస్తినపురం కాలనీ ఎస్టీ హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, కో కన్వీనర్ సూర్యప్రకాష్, నాయకులు రాజేష్, వీరేందర్, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి

● ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్న



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబాబాద్ : వ్యవసాయ కూలీలకు రూ.12 వేల జీవన భృతిని అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగి వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు వెంకటేశ్వర్లు, సత్యం, కట్టయ్య, పైండ్ల యాకయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ఖాళీలు భర్తీ చేయాలి

● ఆస్పత్రి ఎదుట సీపీఎం నాయకుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గార్ల : గార్ల సీహెచ్‌సీలో వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. సీహెచ్‌సీలో డాక్టర్లు లేకపోవడంతో రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందడం లేదని అన్నారు. రాత్రి వేళ అత్యవసర వైద్యం కోసం రోగులు ఆస్పత్రికి వస్తే కేవలం నర్సులు మాత్రమే ఉంటారని, వైద్యులు ఉండటం లేదని తెలిపారు. అనంతరం డాక్టర్ హనుమంతరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అలువాల సత్యవతి, హరి, అంబటి వీరస్వామి, కె.ఈశ్వర్‌లింగం, వి.పెద్దవెంకటేశ్వర్లు, బి.లోకేశ్వరరావు, మహేశ్వరరావు, నాగరాజు, సుజాత, లక్ష్మి, ఉమ,నాగమణి,విజయ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డోర్నకల్ : మహిళలు ఆర్థికంగా ఎదగాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు, సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. స్థానిక సుభాష్‌వీధిలో కల్వరీ ఇంటర్ నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎంఎం సాంఘీక సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మగ్గం పనుల శిక్షణా కార్యక్రమాన్ని అశోక్ ప్రారంభించారు. అనంతరం మగ్గం పనులకు సంబంధించిన పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ డేవిడ్ ఇలియా, డైరెక్టర్ సిస్టర్ సహాయ, శైలజ, శ్రీకాంత్, అజయ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విశ్వకర్మయోజనను వినియోగించుకోవాలి

కేసముద్రం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రామడుగు వెంకటాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి సభ్యుడికి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారికి రూ.15 వేలువైన పనిముట్లను, ఆ తర్వాత రూ.లక్ష రుణం అందిస్తారని ఆయన అన్నారు.

నేడు ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

మహబూబాబాద్: ప్రజా పాలన ప్రజా విజయోత్సవంలో భాగంగా నేడు (మంగళవారం)మున్సిపల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి మదర్‌థెరిసా సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ

కేసముద్రం : ఇనుగుర్తి మండలం కోమటిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శ్రీ ఆత్మకూరి వాగ్దేవి రాంగోపాల్ సహకారంతో రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో, అదే విధంగా తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హుస్నాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి ధరావత్ తిరుపతి నాయక్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను సోమవారం అందజేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

నెల్లికుదురు : విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడొద్దని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సూచనల మేరకు వాల్ పోస్టర్లను సోమవారం వారు ఆవిష్కరించారు.

ల్యాప్‌టాప్ అందజేత

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఎంసెట్‌లతో ర్యాంక్ సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

అన్నపూజ

దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారంలో కొలువైన రామలింగేశ్వర స్వామికి సోమవారం అన్నంతో అభిషేకం, పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం శుద్ధపాడ్యమి సోమవారం ప్రత్యేకంగా అన్నంతో అభిషేకం నిర్వహించడం ఆలయ ప్రత్యేకత అన్నారు.

శబరిమలకు మాలధారుల పాదయాత్ర

మహబూబాబాద్ రూరల్ / కురవి : జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారులు సోమ ఉమా గురుస్వామి ఆధ్వర్యంలో సోమ కళ్యాణ్, శ్రీకాంత్ పాదయాత్రగా సోమవారం శబరిమలకు బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా కళ్యాణ్, శ్రీకాంత్‌లకు అయ్యప్ప దేవాలయ అర్చకులు మాధవన్ నంబూద్రి స్వామి ఇరుముడి ధారణ చేశారు. అలాగే కురవి మండల కేంద్రానికి చెందిన 22 మంది స్వాములు సోమవారం వీరభద్రస్వామి ఆలయంలో ఇరుముడి ధరించారు. గ్రామ పురవీధుల గుండా ప్రదర్శన చేసి శబరిమలకు తరలివెళ్లారు.

'రాత్రి వేళ ఎవరూ ప్రవేశించలేదు'

మహబూబాబాద్ అర్బన్ : గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో అర్ధరాత్రి వేళ ఎవరూ ప్రవేశించలేదని హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓ ఎం.అనిత, స్కూల్ హెచ్‌ఎం పాడుగు నర్సయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీ కార్యాలయం సమీపంలోని ఆశ్రమ వసతి గృహం, పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కొందరు వ్యక్తులు, సంఘాల నాయకులు ఉద్దేశపూర్వకంగానే హాస్టల్‌పై ఫిర్యాదు చేస్తున్నారు. అనుమతి లేనిది ఎవరు లోపలికి వచ్చే అవకాశం లేదన్నారు. ఉపాధ్యాయులు చిట్టిబాబు, రవీందర్, రాజన్న, వెంకన్న, మంగు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దవంగర : మండలంలోని గంట్లకుంటకు చెందిన గీత కార్మికుడు గుర్రం వెంకన్న (55) వృత్తిలో భాగంగా ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోయాడు. దీంతో అతడి నడుము, వెన్నుముక విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

బయ్యారం : రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా రైతులందరికి రుణాలు మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం రాలేదని ఆందోళన

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లిలో అకేరు వాగు ఉధృతితో పంట నష్టపోయిన రైతులకు పంట పరిహారం రాలేదని సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు. అనర్హులకు పరిహారం వచ్చిందని, నిజమైన పంట నష్టపోయిన వారికి పరిహారం రాలేదని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కొత్తగూడ : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ మండల సహాయ కార్యదర్శి ల్యాదల్ల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం రాశులను సోమవారం పరిశీలించారు.

పారిశుద్ధ్య పనులు

గార్ల : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సోమవారం గ్రామాల్లో సైడ్ కాల్వల్లో పూడికతీత, పరిసర ప్రాంతాల్లో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు.

జిల్లా స్థాయి ప్రథమ బహుమతి

మరిపెడ రూరల్ : ప్రజా పాలన ప్రజా విజయోత్సవంలో భాగంగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో వీరారం హై స్కూల్‌కు చెందిన నవీన్ జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం లక్ష్మీనిర్మల తెలిపారు. విద్యార్థిని, గైడ్ టీచర్ రవిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కేసముద్రం : కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన మహమ్మద్ ఆఫ్రా రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం బందెల రాజు తెలిపారు. ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుదాఘాతంలో వ్యక్తి, పాడి గేదె మృతి

మహబూబాబాద్ అర్బన్ : విద్యుదాఘాతంతో వ్యక్తితోపాటు తన పాడి గేదె మృతిచెందిన సంఘటన దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సొప్పరి సోమయ్య(60) రోజంతా పొలంలో పని చేసి వచ్చాడు. బాత్రూంలో వెలుతురు కోసం రేకుల పక్క నుంచి విద్యుత్ కలెక్షన్ తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వీచిన చిన్నపాటి గాలివానకు రెండు రేకులు కూలిపోయాయి. అయితే వాటిని సరిచేస్తున్న క్రమంలో రేకులు మొత్తం కూలిపోయి వైర్‌పై పడ్డాయి. దీంతో వైర్ తెగి రేకుల మీదకు షాక్ రావడంతో సోమయ్యతో పాటు అక్కడే ఉన్న పాడిగేదె సైతం మృతి చెందింది.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఆఫీస్ సబార్డినేట్..

కురవి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా (అటెండర్) పనిచేస్తున్న కలీం(41) వరంగల్‌లోని ఆయన నివాసంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ వీరబాబు సిబ్బందితో కలసి సోమవారం అత్యవసర ఖర్చుల కోసం బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల నగదు అందజేశారు.

డీజిల్ దొంగ అరెస్ట్

దంతాలపల్లి : నిలిపి ఉన్న లారీల్లో, వాహనాల్లో డీజిల్ దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై పిల్లల రాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పనుమటిగూడెం స్టేజి వద్ద గల బాలాజీ పత్తి మిల్లులో పత్తిని తీసుకు వచ్చిన వాహనాలు, పత్తిని తరలించే లారీలు వరంగల్, ఖమ్మం రోడ్డు పక్కన నిలుపుతారు. డ్రైవర్లు నిద్రిస్తున్న వేళ కొందరు వాహనాల డీజిల్ దొంగతనం చేస్తున్నారని అన్నారు. పోలీసులు నిఘా వేయగా నారాయణపేట జిల్లా, కునమనూర్ చివారు గాజులతండాకు చెందిన డెగవత్ చిన్న ఠాగూర్ డీజిల్ దొంగతనం చేస్తు పట్టుబడ్డాడు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్ బీరువా దగ్ధం

దంతాలపల్లి : మండల కేంద్రానికి చెందిన సాదు లక్ష్మి ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో బీరువా దగ్ధమైంది. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టు పక్కవాళ్లు నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. కాగా దుస్తులు, విలువైన సామగ్రి కాలిపోయి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు అకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు



మహబూబాబాద్ రూరల్ / గూడూరు : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా, గూడూరు మండల సమీపంలోని పాకాలవాగు ఒడ్డున,సోమవారం మార్గశిర మాసం పోలిపాడ్యమిని పురస్కరించుకొని మహిళలు గంగా, గౌరీదేవి పూజలు చేశారు.అరటి మట్టల్లో వెలిగించిన దీపాలతో గంగా హారతి సమర్పించారు. అక్కడ నుంచి శివాలయానికి చేరుకున్న భక్తులు పంచామృత అభిషేకాలు నిర్వహించి, ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించారు. అనంతరం పార్వతిదేవికి మహిళలు ఒడి బియ్యం పోసి, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

చింతచెట్టుకు పారుతున్న కల్లు



కొత్తగూడ : ఇదేం వింతో..విచిత్రమో..చింత చెట్టుకు కల్లు పారుతోంది. కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామంలో ఈ వింత సంఘటన వెలుగు చూసింది. పోచమ్మ గుడి సమీపంలో ఎరుకల లక్ష్మయ్యకు చెందిన పెద్ద చింత చెట్టు ఉంది. నాలుగు రోజుల క్రితం చింత చెట్టు కొమ్మ విరిగింది. విరిగిన కొమ్మ నుంచి దార లాగ నీరు రావడం గమనించిన కొమురయ్య కొమ్మకు లొట్టి కట్టాడు. లొట్టిలో రెండు సీసాల నీరు వచ్చింది. అది అచ్చం తాటి కల్లు లాగే ఉండటం విశేషం. మూడ్రోజులుగా కొమురయ్య చింత కల్లు తాగుతున్న విషయం గ్రామం మొత్తం వ్యాపించి ఆ చెట్టును చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. వీరబ్రహ్మం గారు కాలజ్ఞానంలో చెప్పినట్లు జరుగుతోందని చర్చించుకుంటున్నారు.